తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాదాద్రి భువనగిరి
శుక్రవారం 28 నవంబర్ 2025 | పేజీలు : 8





## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా
# ప్రతి ఒక్కరు సహకరించాలి
### జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్

**కనగల్, డిసెంబర్ 5 (జనంసాక్షి)**
గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ కోరారు. మండల కేంద్రంలోని కనగల్ గ్రామపంచాయతీ వద్ద ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతోపాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్న కార్యక్రమంలో ఎస్పి శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంగా నడిచే ఎన్నికలు కావున ఓటర్ని డబ్బు, మద్యానికి లోపర్చవద్దని అతని ఓటును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామాలలో ఎవరి ప్రచార సాధనాలు వారు ఉపయోగించుకోవాలని ఇతని కించపరిచే విధంగా ఉండకూడదని సూచించారు. సోషల్ మీడియాలో రకరకాల పోస్టులు పెట్టి వారి మనోభావాలను దెబ్బతినేలా చూడవద్దని పేర్కొన్నారు. ఒకవేళ అలా చేసినట్లయితే ఎన్నికల నిబంధనల ప్రకారం వారిపై చట్టరీత్య చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్పి వెంట చండూర్ సీఐ కె ఆదిరెడ్డి, ఎస్సై రాజీవ్ రెడ్డి , వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, పోటీలో బరిలో నిలిచిన అభ్యర్థులు పాల్గొన్నారు.

## నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయాలి



**చౌటుప్పల్ డిసెంబర్ 5 (జనంసాక్షి):**
యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడతలో భాగంగా, నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ మండల పరిధిలోని పంతంగి క్లస్టర్ ను శుక్రవారం సందర్శించారు. నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్లు దాఖలు చేయడానికి శుక్రవారం చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్ వేయడానికి వచ్చి లైన్లలో నిలబడ్డారు. ఈ సందర్భంగా, కలెక్టర్ మాట్లాడుతూ అధిక సంఖ్యలో అభ్యర్థులు ఉన్నందున నామినేషన్లను చాలా జాగ్రత్తగా స్వీకరించాలని ఆదేశించారు. సాయంత్రం 5 గంటల సమయానికి నామినేషన్ దాఖలు చేసేందుకు క్యూ లైన్లో నిలబడి ఉన్న అభ్యర్థులందరికీ చివరి అభ్యర్థి నుండి మొదటి అభ్యర్థి వరకు నెంబర్ల వారీగా టోకెన్లు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎంత సమయం పట్టినా సరే, క్యూ లైన్‌లో నిలబడిన చివరి అభ్యర్థి నామినేషన్ పూర్తయ్యే వరకు ప్రక్రియను కొనసాగించాలని స్పష్టం చేశారు. పోలీస్ అధికారులు 5 గంటల తర్వాత గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి, లోనికి కొత్తగా ఎవరూ రాకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టారు.

## గ్యాస్ డెలివరీలో అధిక ధరలు
# వసూలు చేస్తే కేసులే



## కందగట్ల గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి

**సూర్యాపేట(జనంసాక్షి):**
తనను గెలిపిస్తే కందగట్ల గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కందగట్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి శిగ నాగమణి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనం, వెటర్నరీ హాస్పిటల్, బొడ్రాయి పునర్ ప్రతిష్టాపన, బస్టాండ్ నుంచి హైస్కూల్ వరకు సీసీ రోడ్లు, సూర్యాపేట నుంచి గ్రామానికి బస్సు పునరుద్ధరణ జరిగేలా కృషి చేస్తానని తెలిపారు.గ్రామంలో బతుకమ్మ వేడుకలకు స్థలం కోసం,నూతన గ్రంథాలయం ఏర్పాటుకు , హైమాక్స్ లైట్లు, ప్రధాన కూడళ్లలో సొంత ఖర్చులతో సీసీ కెమెరాలు ఏర్పాటు, మూడు నెలలకొకసారి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.పార్టీలకు అతీతంగా అర్హులైన అందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.



## కోదాడలో మీసేవ కేంద్రంపై
# మీసేవ కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**కోదాడ, డిసెంబర్ 5 (జనంసాక్షి):**
కోదాడలోని మీసేవ కేంద్రాన్ని ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ కమిషనర్ టి. రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అకస్మాత్తుగా కమిషనర్ సందర్శించడంతో కేంద్రంలో ఒకసారిగా హడావుడి నెలకొంది. సేవల నిర్వహణ, రుసుముల వసూళ్లు, టోకెన్ విధానం, డిజిటల్ రికార్డులు తదితర అంశాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా కమిషనర్ కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న సేవలను ఆరా తీశారు. రిజిస్టర్ పరిశీలన, లాగిన్ రిపోర్టులు, పని వేళల్లో పారదర్శకత, వేగవంతమైన సేవలపై ఆయన సిబ్బందిని ప్రశ్నించారు. సర్వీస్‌లను సమయానికి అందిస్తున్న తీరు, ప్రజలతో స్టాఫ్ ప్రవర్తన, పని తీరు చూసి కమిషనర్ అభినందనలు తెలిపారు. ప్రత్యేకంగా కేంద్ర నిర్వాహకుడు కొనసాగిస్తున్న క్రమశిక్షణ, సేవలపై చూపుతున్న నిబద్ధతను మెచ్చుకున్న కమిషనర్, అందరి సమక్షంలో మీసేవ నిర్వాహకుడికి సన్మానం చేసి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. నియమ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందిస్తున్న మీసేవ కేంద్రాలు రాష్ట్రానికి ఆదర్శం. ఇక్కడి టీమ్ పనితీరును అభినందించాలి" అన్నారు.కమిషనర్ తనిఖీ సన్మానం జరుగుతుండగా ప్రజలు కూడా పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను వివరించారు. కొద్ది నిమిషాలు వారితో మాట్లాడి, అవసరమైన దిశలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.కోదాడలో మీసేవ సేవలు మరింత మెరుగు పడతాయన్న నమ్మకంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కోదాడ ఆర్డిఓ సిహెచ్. సూర్యనారాయణ, తాసిల్దార్ వాజిద్ అలీ, గఫూర్ అహ్మద్, డిస్టిక్ మేనేజర్ సైదా నాయక్, మీసేవ నిర్వాహకుడు కొదుమూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ కాంగ్రెస్ కు చేయిచ్చి బిఆర్ఎస్ లో చేరికలు

## కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు




**మిర్యాలగూడ, డిసెంబర్ 05,( జనంసాక్షి )**
స్థానిక సంస్థల ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బి ఆర్ ఎస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరుతున్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక బి ఆర్ ఎస్ కార్యాలయంలో కాల్వపల్లి, కల్లేపల్లి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, టీడీపీ నాయకులు కార్యకర్తలు బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ అవినీతి పాలనలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయకుండా కేవలం కమిషన్ల కోసం మాత్రమే క్యాబినెట్ పనిచేస్తుందని ఆరోపించారు. అలాంటి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి రావాలంటే స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రభుత్వ లోపాలను ప్రజల్లోకి తీసుకుపోయి టిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, మట్టపల్లి సైదయ్య యాదవ్, జెట్టి లింగయ్య, ఎండి యూసుఫ్, కుందూరు వీర కోటిరెడ్డి, ఆంగోతు హాతీరాం నాయక్, పాచ్చు నాయక్, మేఘనాయక్, పందిర్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మల్లు వెంకట నరసింహారెడ్డి వర్ధంతి వేడుకలు

### చిత్రపటానికి నివాళులర్పించిన సిపిఎం నాయకులు

**పెన్ పహాడ్ డిసెంబర్ 05 (జనంసాక్షి) :**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ మల్లు వెంకట నరసింహారెడ్డి 21వ వర్ధంతిని మండల కేంద్రంలో శుక్రవారం సిపిఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని రైతాంగ సమస్యల కోసం నిరంతరం పోరాడిన మహానేత నరసింహారెడ్డి అని అన్నారు అంతేకాకుండా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా తెలంగాణ రాష్ట్రంలో పేరుగాంచారని తెలిపారు. ఆయన సతీమణి సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యురాలు,తుంగతుర్తి మాజీ ఎం ఎల్ ఎ దివంగత మల్లు స్వరాజ్యం ఆయన బాటలో నడిచి బడుగు బలహీన వర్గాల సమస్యల కోసం కృషి చేశారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు నివాళులర్పించిన వారిలో నాయకులు రణపంగ కృష్ణ, రణపంగ బుచ్చి రాములు, రాఘవయ్య, నరేష్, మంగయ్య, వెంకట్, తదితరులు ఉన్నారు...

## బట్టుగూడెం నాయకులు బిఆర్ఎస్‌లో చేరిక

హాలియా, డిసెంబర్ 5 జనం సాక్షి:



పెద్దవూర మండలం బట్టుగూడెం గ్రామానికి చెందిన దండెం వెంకన్న, రుద్రాక్ష రాములులకు తమకు వద్దని తెలిపినప్పటికీ కాంగ్రెస్ గ్రామ నాయకులు బలవంతంగా కాంగ్రెస్ కండువాలు కప్పినట్టు సమాచారం. కాగా శుక్రవారం హాలియా పట్టణంలో నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో వీరు అధికారికంగా బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరితో పాటు వేముల శ్రీనివాస్, ఆదిమల్ల సత్యనారాయణ కూడా బిఆర్ఎస్‌లో చేరారు. నోముల భగత్ మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు భయభ్రాంతులకు గురి చేసి బిఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టే పరిస్థితుల్లో లేరని, ప్రజలు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనతో విసిగి, మళ్లీ కేసీఆర్ పాలనకే అభివృద్ధి సాధ్యమని నమ్మి బిఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుందర్ రెడ్డి, చెన్ను వెంకట్ రెడ్డి, కూన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాశిమల్ల రాములు, బోగారాల ఏసోబు, బొంగరల రమణయ్య, పొట్టేపాక లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



## శ్రీనాథపురం సర్పంచ్‌గా కాంగ్రెస్ అభ్యర్థి సీతమ్మ ఏకగ్రీవం..

హాలియా, డిసెంబర్ 5 జనం సాక్షి:
శ్రీనాథపురం గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్ రెడ్డి సీతమ్మ %-% వెంగల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. గ్రామంలో మొత్తం 8 వార్డులు ఉండగా, ఇప్పటివరకు 4 వార్డులు ఏకగ్రీవంగా ఎంపిక కావడం విశేషం. 2014లో స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన సీతమ్మ - వెంగల్ రెడ్డి, 2025లో విజయాన్ని సాధించడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సీతమ్మకు మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, శాసనసభ్యులు జైవీర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా సేవ చేసేందుకు అవకాశం ఇవ్వాలి

**గుండ్లబావి గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నందగిరి పరమేష్ గౌడ్**

**చౌటుప్పల్ డిసెంబర్ 5 (జనంసాక్షి)**
ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో తాను సర్పంచ్ అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నానని గుండ్లబావి గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నందగిరి పరమేష్ గౌడ్ అన్నారు. పంతంగి క్లస్టర్ల పరిధిలో శుక్రవారం ఆయన తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో గతంలోనే కోటి రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాల్లో గెలుపొందుతుందన్నారు.



## హాలియాలో మస్జీదే మనవరా పునర్నిర్మాణ కార్యాలకు శుభారంభం

**హాలియా, డిసెంబర్ 5 జనంసాక్షి:**



హాలియా పట్టణ కేంద్రంలోని మస్జిద్ మస్జీదే మనవరా పునర్నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమీయత్ ఉలమాయే హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు హజరత్ మౌలానా ఏసానుద్దీన్నుద్దీన్, అలాగే మాజీ మంత్రి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర జమీయత్ ఉలమాయే హింద్ అధ్యక్షునిగా ఎన్నికై మొదటిసారి హాలియాకు విచ్చేసిన సందర్భంగా, ఏసానుద్దీన్‌ను హాలియా ముస్లిం సోదరులు ఆలీనగర్ నుండి హాలియా కేంద్రం వరకు భారీ ర్యాలీతో స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జానారెడ్డి, ఏసానుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మౌలానా అక్బర్ ఖాన్, సీనియర్ కమిటీ అధ్యక్షుడు షర్ఫుద్దీన్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మజహర్ మొహియుద్దీన్, మజీద్ కమిటీ అధ్యక్షుడు అజీముద్దీన్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు బాబుద్దీన్, అన్వరుద్దీన్, నసీరుద్దీన్, మౌలానా పిరాసతుల్లా, మౌలానా హమీద్, హాఫిజ్ ఖదీర్, హాఫిజ్ వహీద్, ఫక్రుద్దీన్, ఫసియుద్దీన్, అలాగే పెద్దవూర జానీ, జాహెద్ జానీ, అబ్రార్, మహమూద్, సులేమాన్, గౌస్, ఫయాజ్, అమీర్ అలీ, హమీద్, రషీద్, గౌస్ రషీద్, ఆసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమాలు చేయాలి

## బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం లో మల్లు

**మిర్యాలగూడ, డిసెంబర్ 05,( జనం సాక్షి)**
హక్కుల సాధన కోసం కార్మికులు ఉద్యమాలు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక సిఐటియుకార్యాలయంలో బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాల రాసేందుకు కొత్త చట్టాలనుతీసుకువచ్చిందని విమర్శించారు. కార్మికుల సంక్షేమం కోసం ఉన్న అనేక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకురావడం వల్ల కార్మికులకు తీరని అన్యాయంజరుగుతుందన్నారు. కార్మికులుకు అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించే తత్వం లేకుండా పోతుందని కనీసం సంఘాలు ఏర్పాటు చేసుకునే అర్హత కూడా ఉండకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త చట్టాల రద్దు కోసం కార్మికులు బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు ఐక్యంగా ఉండి ఉద్యమాలు నిర్వహించి కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పి కొట్టాలని కోరారు. అనంతరం యూనియన్ నూతన అధ్యక్షుడుగా షేక్ పాషాను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రామ్మూర్తి, సిఐటియు నాయకులు బావాండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, అరుణ, బి ఎం నాయుడు, మంద రాజు, నశీర్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ముచ్చటగా మూడోసారి సర్పంచ్ గా ఎన్నికైతే మరింత అభివృద్ధి చేస్తా..

### ○ విలేకరుల సమావేశంలో ధారావత్ చందు నాయక్ వెల్లడి



**బూర్గంపహాడ్ డిసెంబర్ 05 (జనంసాక్షి)** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముచ్చటగా మూడోసారి పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికైతే సారపాక పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇండిపెండెంట్ సర్పంచి అభ్యర్థి ధారావత్ చందు నాయక్ అన్నారు. గతంలో మా నాన్నగారు ధరావత్ రాజు 20 సంవత్సరాలు ఇదే పంచాయతీ సర్పంచ్ గా ఉండి పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు, బీద, బడుగు, బలహీన వర్గాలను ఆయన హక్కున చేర్చుకొని వారి అవసరాలకు అనుగుణంగా సర్పంచ్ విధులు నిర్వహించి ఆ సీటుకి వన్నె తెచ్చారన్నారు. అదే బాటలో నేను రెండుసార్లు సారపాక సర్పంచ్గా ఎన్నికయి మౌలిక వసతుల కల్పనకు ఎంతగానో కృషి చేశానని అన్నారు. ముచ్చటగా మూడోసారి గెలిస్తే సారపాక ప్రజలకు కావలసిన మంచినీరు డ్రైనేజీ వ్యవస్థలు ఇల స్థలాలు స్థానిక యువతకు ఉపాధి కల్పన, ఈఎస్ఐ ఆసుపత్రికి కృషి, ముఖ్యంగా ఈ ప్రాంతంలో 30,000 మంది ప్రజలు ఉన్న వారిలో ఎవరైనా చనిపోతే కనీసం స్మశాన వాటిక లేదని, అందుకోసం స్మశాన వాటికకు స్థలం కేటాయిస్తానని అన్నారు. పేద ప్రజల మహిళలకు 3000 మందికి ఉపాధి కల్పిస్తానని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు ఏవి ఉన్నా నేను శ్రద్ధ తీసుకుంటాను తప్ప.. ఎవరో వీళ్ళ లాగా తాత్కాలికంగా పోతే వెంట్రుక వస్తే ఏదో అన్నట్లుగా.. 11వ తారీకు తర్వాత కంటికి కనబడరని అది నాకు, ప్రజలకు తెలుసు నని, ప్రతిసారి నాకు ఇదో ఎక్సర్సైజ్ అది రెండుసార్లు ఇది మూడోసారి మీరు చూస్తారని అన్నారు. ఎందుకంటే వాళ్ళ ఉండటమే నా గెలుపుకు కారణమని, దానికి నాకు అందరి సపోర్ట్ వస్తుందని అన్నారు. అలాగే ఈ ప్రాంతంలో యువతకి అన్ని రకాల అవకాశాలు ఇవ్వడం కోసం అందరి సహకారం తీసుకొని కంపెనీ విషయంలో పోరాటం చేసే విషయం మీకు తెలుసునని, మెగా ప్లాంట్ మీటింగ్ జరుగుతూఉంటే ముందుగానే నన్ను నిర్బంధించారని తెలియజేశారు. 11 వ తారీఖున జరిగే పోలింగ్ కు ప్రజలు బ్యాట్ గుర్తుపై ఓటును వేసి నన్ను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## కులమతాలకు అతీతంగా అన్నదానం చేయడం అభినందనీయం

సూర్యాపేట (జనంసాక్షి):
కులమతాలకు అతీతంగా అన్నదానం చేయడం అభినందనీయమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శబరి నగర్ లో గల అయ్యప్పస్వామి దేవాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు ఫారుఖ్ ఆధ్వర్యంలో వివిధ మాలాధారణ స్వాములకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కుల మతాలకతీతంగా యువజన కాంగ్రెస్ నాయకులు ఫరూక్ మాలధార స్వాములకు గత కొన్ని సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ పూర్వ వైభవం తీసుకువస్తుందన్నారు. దేవుని ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అన్నదానానికి తన వంతుగా ఆర్థిక సాయం అందజేస్తున్నానని హామీ ఇచ్చారు. యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు ఫారుఖ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కుల మతాలకు అతీతంగా మాలాధారణస్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్మూర్తి యాదవ్, మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, వల్దాస్ దేవేందర్, పిల్లల రమేష్ నాయుడు, గొట్టి ముక్కల శ్రీనివాస్ రెడ్డి, జటంగి రవి, గోపారపు రాజు, గుండా వెంకన్న, వివిధ మాలధారణ స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## నారాయణపురం గ్రామ సర్పంచ్ గా గొల్లమందల వెంకటేశ్వర్లు ఏకగ్రీవం



**కల్లూరు డిసెంబర్ 05(జనంసాక్షి)**
మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచి పదివార్డులకు ఒక్కొక్క నామినేషన్ శుక్రవారం దాఖలు కావడంతో ఏకగ్రీవం అయ్యేఅవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. మండల పరిధిలోని నారాయణపురం స్వగ్రామం చెందిన తెలంగాణ రాష్ట్రరెవిన్యూ సమాచార గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అదే గ్రామం బిజెపి జాతీయ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఇరువురికి సొంత గ్రామం. గతంలో కూడా నారాయణపురం గ్రామం సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అదే ఆనవాయితీని కొనసాగించేందుకు ఇరు పార్టీల నాయకులు సహకారంతో ప్రజల అభిప్రాయం మేరకు సర్పంచిగా గొల్లమందల వెంకటేశ్వర్లు నుఎంపిక చేయడంతో నామినేషన్ వేశారు . అదేవిధంగా 10 వార్డులకు పది మందిని ఎంపిక చేయడంతో నామినేషన్ వేశారు. శనివారం స్క్రూట్ ని అనంతరం నామినేషన్ల ఉపసంహరణ రోజున ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటించనున్నారు. సర్పంచ్ గా ఎన్నిక కాబోతున్న గొల్లమంద వెంకటేశ్వర్లు ను వార్డు సభ్యులుగా పోటీ చేసిన పదిమందిని పలువురు నాయకులు అభినందించారు.

## మల్లు వెంకట్ నరసింహారెడ్డి ఆశయ సాధనకు యువత పాటుపడాలి

### సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, కొలిశెట్టి యాదగిరిరావు

**తుంగతుర్తి డిసెంబర్ 5 (జనంసాక్షి)**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత మల్లు వెంకట నరసింహారెడ్డి ఆశయ సాధన కోసం నేటి యువత పాటుపడాలని సిపిఎం పార్టీ రాష్ట్ర సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు, శుక్రవారం మండల కేంద్రంలో మల్లు వెంకట్ నరసింహారెడ్డి 21 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పోరాడిన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అని అన్నారు, నైజాం పరిపాలనకు వ్యతిరేకంగా యువతను క్రమశిక్షణతో ఒక ఉన్నతమైన జ్ఞానాన్ని అందించి చైతన్య పరిచి ఉద్యమంలో భాగస్వాములను చేసి బూర్జువా భూస్వామశక్తులకు ఎదురుగా నిలబడి పోరాటంలో ముందు నడిచిన మహనీయుడని అన్నారు, ఉమ్మడి నల్లగొండ జిల్లా పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ఆశయాల కోసం కడదాకా కమ్యూనిస్టు ఉద్యమాన్ని అంటిపెట్టుకొని ఒక క్రమశిక్షణ కలిగిన సిపిఎం నాయకులుగా ఎంతో మందికి ఆయన ఆదర్శపరుడిగా నిలిచాడని అన్నారు, వి ఎన్ ఆశయాలు అమలైనప్పుడే ఈ ప్రాంత ప్రజలు సమాజంలో సమానతతో సామాజిక ఆర్థిక రాజకీయాలలో స్వాలంబన సాధిస్తారని ఆయన బాటలో ప్రతి ఒక్కరు నిలబడి ముందుకు సాగాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి తాటి విజయమ్మ, మండల కమిటీ సభ్యులు గడ్డం ఎల్లయ్య, ఉప్పుల సోమయ్య, విష్ణుమూర్తి ,మడి పెద్ది యాదగిరి ,తదితరులు పాల్గొని నివాళులర్పించారు





## బూర్గంపహాడ్ సర్పంచ్ అభ్యర్థి భూపల్లి నరసింహారావుకి తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు

### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు పోటు రంగారావు

**బూర్గంపహాడ్ డిసెంబర్ 05 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన సమావేశంలో బూర్గంపహాడ్ గ్రామ పంచాయతీ ఇండిపెండెంట్ సర్పంచి అభ్యర్థి మాజీ జెడ్పిటిసి భూపల్లి నరసింహారావు కు మండల తెలుగుదేశం పార్టీ తమ మద్దతును ప్రకటించినట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు పోటు రంగారావు, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు జగదీశ్వర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు పోటు రంగారావు మాట్లాడుతూ బూర్గంపహాడ్ గ్రామ పంచాయతీలో గతంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే సర్పంచులుగా ఎన్నికయ్యారని, తెలుగుదేశం పార్టీకి బలమైన నాయకత్వం కార్యకర్తలు ఉన్నారని, వీరందరూ ఒకే తాటిపై ఉంటారని, తప్పకుండా తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి భూపల్లి నరసింహారావు గెలుపు ఖాయమని అన్నారు. నిస్వార్ధ నాయకుడు గ్రామ ప్రజల మనసుల్లో ప్రత్యేకమైన స్థానం ఏర్పరచుకున్న వ్యక్తిగా గ్రామ ప్రజల ఆశీస్సులు మెండుగా కలిగిన వ్యక్తిగా నిజాయితీ, నిబద్ధత, రాజకీయ ప్రలోభాలకు లొంగని మనిషిగా గుర్తింపు పొందిన సర్పంచి అభ్యర్థి మాజీ జెడ్పిటిసి భూపల్లి నరసింహారావుకు తెలుగుదేశం పార్టీ తమ సంపూర్ణ మద్దతును తెలియజేసినట్లు తెదేపా రాష్ట్ర నాయకులు పోటు రంగారావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిరిపురపు స్వప్న, మాజీ సర్పంచ్ పుట్టి కుమారి, తెలుగుదేశం పార్టీ నాయకులు దుద్దుకూరి జ్ఞానేంద్రరావు, గాంధీ రెడ్డి, దుద్దుకూరి శేఖర్, ఒకటవ వార్డు అభ్యర్థి కనసాని కోటేశ్వర చారి, డా. లక్కోజు విష్ణువర్ధన్, బొల్లు శ్రీను, పుట్టి నాగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: ఏ బి వి పి

**దేవరకొండ, డిసెంబర్05(జనంసాక్షి):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ విభాగ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏర్పడి సుమారు మూడు సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటివరకు విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా, ఎన్నికల నేపథ్యంలో రేపు (6వ తేదీన) దేవరకొండలో జరగబోయే సభకు సీఎం రేవంత్ రెడ్డి విచ్చేయడం సరికాదని అన్నారు. వెనకబడిన గిరిజన ప్రాంతమైన దేవరకొండలో విద్యార్థులు విద్యకు ఇబ్బంది పడే పరిస్థితి కనిపిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులకు అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామనేది గత ప్రభుత్వ హామీ, అలాగే ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కూడా "త్వరలో ఏర్పాటు చేస్తాం" అంటూ చెప్పిన మాటలు కేవలం హామీలుగానే మిగిలిపోయాయాని అన్నారు. ఈ ప్రాంతంలోని విద్యార్థులు ఉన్నత చదువులకు హైదరాబాద్లోని ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో చదివి పూర్తి చేసినప్పటికీ, వారి సర్టిఫికెట్లు సకాలంలో అందక, స్కాలర్షిప్–ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం వల్ల కళాశాలల్లో చిక్కుకుపోయే పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న 8,500 కోట్ల స్కాలర్షిప్–ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలిని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి పగిళ్ల విక్రం, నగర జాయింట్ సెక్రటరీ జి. శివరామరాజు, యలమల హేమసుందర్, నగర హాస్టల్ కన్వీనర్ అంజలి, కావ్య, అంకిత, కైలాష్, మనోజ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.





## కల్లూరు గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ (సిపిఎం బలపర్చిన) అభ్యర్థిగా చలసాని మంజుల శ్రీనివాసరావు నామినేషన్

**నేరేడుచర్ల (జనంసాక్షి) :**
కల్లూరు గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ (సిపిఎం బలపర్చిన) అభ్యర్థిగా చలసాని మంజుల శ్రీనివాసరావు నామినేషన్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొనతం చిన వెంకటరెడ్డి, ఎన్నారై చలసాని రాజీవ్, మాజీ వైస్ ఎంపీపీ చలసాని మాధవరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్టయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ లు కొడాలి భాస్కర్ రావు, అనంతు శ్రీనివాస్ గౌడ్, కల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడిగే వెంకటేశ్వర్లు గౌడ్, కర్ణాకర్ రావు, మేకపోతుల నాగరాజు, బుడిగే రోశయ్య, చామకూరి వినోద్, అనంత వెంకన్న, గుడుగుంట్ల వెంకటేశ్వర్లు, మేకపోతుల పిచ్చయ్య, మట్టయ్య, ప్రేమ్ కుమార్, హరికృష్ణ,అశోక్, సతీష్, హుస్సేన్, శ్యామ్ కుమార్, ప్రవీణ్, జగన్, పార్టీ కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసి చూపిస్తా ఆశీర్వదించండి

## ఎస్ లింగోటం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి భీమిడి ప్రదీప్ జీ



**చౌటుప్పల్ డిసెంబర్ 5 (జనంసాక్షి)**
గ్రామ ప్రజలు ఆశీర్వదిస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ము చెయకుండా గ్రామంలో బాధ్యతయుతమైన పాలన అందిస్తానని, గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని స్వాములవారి లింగోటం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి భీమిడి ప్రదీప్ జీఅన్నారు. శుక్రవారం స్వాములవారి లింగోటం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా భీమిడి ప్రదీప్ జీ నామినేషన్ వేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం పేరిట గ్రామ పంచాయతీలను అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిందని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ పని చేస్తుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కి గ్రామాలే పట్టుకొమ్మలని, అలాంటి గ్రామాలలో ఆశతో ఉన్నవారికి అధికారం ఇస్తే దోచుకుంటారు. ఆలోచనతో ఉన్న వారికి అధికారం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తారని అన్నారు. గ్రామాభివృద్ధి కి ఎస్ లింగోటం గ్రామ ప్రజలు ఆశీర్వదించి సర్పంచ్ గా గెలిపిస్తే అన్ని రంగాల్లో ముందుండి మీ సమస్యలే నా సమస్యలుగా భావించి నిరంతరం ప్రజాసేవ కొరకు కృషి చేస్తానని అన్నారు. అధికారం ఉన్న లేకున్నా గ్రామంలోని పేద ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకున్నానని, పేద ప్రజల పిల్లల విద్యకు తన సొంత ఖర్చులతో సహకరించానని తెలిపారు. ప్రజలు నాపై విశ్వాసంతో నన్ను ఆశీర్వదిస్తే గ్రామంలోని అన్ని రంగాల వర్గాల వారికి అనుకూలంగా సేవలందిస్తానని కుల మత జాతి విభేదాలు లేకుండా పనిచేస్తానని,అందరిని సమాన దృక్పథంతో ప్రతి ఒక్కరిని ఆత్మగౌరవంతో సమాజ సేవ చేయడానికి ముందుకు వచ్చను మీరందరూ పెద్ద మనసు చేసుకొని సర్పంచ్ గా గెలిపిస్తే అనేక అభివృద్ధి పనులు చేయిస్తాను, రాజకీయంగా, ఆర్థికంగా,సమాజ సేవకు ముందుండి సేవ చేయడానికి ఒక్క అవకాశం ఇవ్వాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిస్వార్థ రాజకీయాలకు తావు లేకుండా నిస్వార్థమైన సేవలను అందించడంలో ముందు ఉంటానని, ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని గ్రామస్తులను కోరారు. అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థి నారపాక నగ్మా ఆంజనేయులు..



**చండూరు మండలం డిసెంబర్ 5 (జనంసాక్షి)**
చండూర్ మండలంలోని నెర్మట గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి నారపాక నగ్మా ఆంజనేయులు శుక్రవారం రోజున నెర్మట గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ.. ప్రజలని మీ అమూల్యమైన ఓటు బ్యాట్ గుర్తుకు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పలువురు గ్రామ ప్రజలు హారతి, కుంకుమ తిలకంతో స్వాగతం పలికారు అంతే కాకుండా తప్పకుండా పోస్టల్ బ్యాలెట్ నెంబర్ మూడు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో రవి, రాములు, రాజేందర్, గిరి, లక్ష్మణ్, మహేష్, శేఖర్,చింటూ గని , ప్రవీణ్, సాలమ్మ, రజిత, అండాలు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



**హుజూర్ నగర్, డిసెంబర్ 5 (జనంసాక్షి):**
నియోజక వర్గం లోని మఠంపల్లి మండలం యాతావాకిళ్ళ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి కుక్కల కరుణ, భర్త నాగరాజు శుక్రవారం నామినేషన్ దాఖాలు చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి కుక్కల కరుణనాగరాజు మాట్లాడుతూ గ్రామ అభివృధి కోసం రాజకీయాలలోకి వచ్చాము. గ్రామంలో చాలా సమస్యలు ఉన్నాయి. అందులో ప్రధానంగా డ్రైనేజీ, రోడ్లు, యువతకు ఉద్యోగాల కల్పన వంటివి ఉన్నాయి. అందరిని కలుపుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. గత పాలకులు గ్రామాన్ని దోసుకున్నారని ఆరోపించారు. యువ నాయకురాలిని, సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిని, తనకి ఒక అవకాశం ఇచ్చి సర్పంచిగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం వీరయ్య, మండల వర్కింగ్ ప్రసిడెంట్ వంటిపులి శ్రీను, బాలు బైరి, కిసరి వెంకన్న, బండి వెంకట్ రెడ్డి, బుడిగ కాషాయ్య, బూడిగ నాగులు, లింగయ్య, వెంకన్న, భాస్కర్, ప్రసన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ డెలివరీలో అధిక ధరలు వసూలు చేస్తే కేసులే

## గ్యాస్ సిలిండర్ల డెలివరీకి అధికంగా వసూలు చేసే వారిపై క్రిమినల్ కేసులు ఖాయం

### పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్

**చండూరు మండలం డిసెంబర్ 5 (జనంసాక్షి)**
గ్యాస్ సిలిండర్ సరఫరా లో అక్రమాలు ఉపేక్షించే ప్రసక్తే లేదని.గ్యాస్ డెలివరీ బాయ్ ల పై క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్ హెచ్చరించారు.శుక్రవారం నాడు ఆయన చండూరు లో గ్యాస్ సిలిండర్ ల అధిక వసూళ్ల పై కొందరు వినియోగదారులు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..గ్యాస్ సిలిండర్ ల డోర్ డెలివరీ కి అక్రమంగా అధికంగా వసూలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు.గ్యాస్ బండల సరఫరా లో కొందరు డెలివరీ బాయ్ లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదు లు వస్తున్నాయన్నారు.అక్రమ వసూళ్ల కు పాల్పడే వారిపై ఒక్కరు ఫిర్యాదు చేసినా చాలు అని రఘునందన్ సూచించారు.గ్యాస్ కు రశీదు కూడా ఇవ్వటం లేదన్న ఫిర్యాదులు అధికంగా ఉన్నాయని ఆక్షేపించారు.

# నోటుకు ఓటు గ్రామ అభివృద్ధికి ముప్పు

## సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్



నూతనకల్ డిసెంబర్ 5(జనం సాక్షి)
నోటుకు ఓటు గ్రామాభివృద్ధికి ముప్పు అని సంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీకాంత్ అన్నారు, శుక్రవారం మండల పరిధిలోని శిల్పకుంట్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ సమాచార పౌర సంబంధాల అధికారుల ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా కళాబృందం చే ఓటు యొక్క విలువ పై ప్రజలకు అవగాహన కల్పించారు, ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని దాన్ని నోటుకు ఓటు అమ్ముకోకూడదని అన్నారు, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును సక్రమంగా వినియోగించాలన్నారు ఎన్నికల నేపథ్యంలో, మద్యం, మాంసానికి అమ్ముడుపోయి ఓటును అమ్ముకోకూడదని, నిజాయితీగా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును యువతి యువకులు వినియోగించుకోవలనీ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా,గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించే అర్హుడైన అభ్యర్థిని ఎన్నుకొని గ్రామ అభివృద్ధి కోసం ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు, అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత రీజనల్ వ్యాధుల పైన అవగాహన నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా టీం లీడర్ పల్లెల లక్ష్మణ్. గంట బిక్షపతి. గడ్డం ఉదయ్. పల్లెల రాము. మాగి శంకర్. పాక ఉపేందర్. మద్దిరాల మంజుల. కుందమల్ల నాగలక్ష్మి. ములకలపల్లి మల్లమ్మ. సిరిపంగి రాధ. గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడులో సర్పంచ్ అభ్యర్థి జోరుగా ప్రచారం

### జిట్టగోని మనోహర యాదగిరి

**మునుగోడు డిసెంబర్ 05(జనం సాక్షి):**
మునుగోడు నియోజకవర్గ మండల కేంద్రంలో సర్పంచ్ అభ్యర్థి జిట్టగోని మనోహర యాదగిరి బ్యాలెట్ నమూనా పత్రాలు చేతబూని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఓటు వేయాలని, మునుగోడు గ్రామ అభివృద్ధి ఏ విధంగా చేయాలని వివరిస్తూ ప్రతి ఓటరు డబ్బును కాదు, ప్రజల బాగోగులు చూసే అభ్యర్థిని చూసి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు.



# కోయగూడెం బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిపై దాడి

## నామినేషన్ కేంద్రంలోనే కొట్టారని అభ్యర్థి ఆరోపణ





**టేకులపల్లి,డిసెంబర్ 5 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని చుక్కా లబోడు నామినేషన్ల కేద్రం వద్ద కోయగూడెం పంచాయతీ బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పూనెం కరుణాకర్ పై కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, ఆయన భార్య ఉమా శుక్రవారం దాడి చేసి కొట్టారని కరుణాకర్ విలేఖ రులకు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నామినేషన్లకు చివరి రోజు కావడంతో రెండో నామినేషన్ వేసేందుకు కరుణాకర్ కేంద్రం వద్దకు వచ్చి వరుసలో నిలబడ్డాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఇల్లందు ఎమ్మెల్యే సోదరుడు, కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, ఆయన భార్య ఉమ వచ్చి నామినేషన్ ఎందుకు వేస్తున్నా వంటూ ఘర్షణకు దిగి అయ్యప్ప మాల వేసి ఉన్నకరుణాకర్ పై చేయి చేసుకున్నారన్నారు. ఎలా పోటీ చేస్తావు, బయటకు రా నీ అంతు చూస్తా చంపేస్తామంటూ బెదిరించారని తెలిపారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన వార్డు సభ్యులను కూడా బెదిరించి పంపించారని ఆరోపించారు. వెంటనే 100 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. సురేందర్‌తో ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

ప్రజాస్వామ్యంలో ఇంత దారుణమా :

మాజీ ఎమ్మెల్యే హరిప్రియనామినేషన్ వేసేందుకు వచ్చిన తమ పార్టీ బలపరిచిన అభ్యర్థి పూనెం కరుణాకర్ ను ఎమ్మెల్యే కోరం కనకయ్య సోదరుడు కోరం సురేందర్, మాజీ సర్పంచ్ పూనెం ఉమలు దాడి చేసి కొట్టారని విలేకరులతో తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక ఎక్కడ ఉన్నామని, ఇంత దారుణమా అని ప్రశ్నించారు. తాము పోటీలో నిలబెట్టిన అభ్యర్థి ఓడి పోతున్నదని బయపడి దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధిరారి కి, పోలీసులకు, జిల్లా కలెక్టర్ కు, ఎన్నికల కమీషన్ కు ఫిర్యాదుచేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామంగా కోయగూడెం పంచాయతీ ఉండగా నామినేషన్ల కేంద్రంలో కనీసం సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఎన్నికల నామినేషన్ల కేంద్రంలో దాడులు చేస్తే రక్షణ ఎక్కడ ఉందన్నారు. దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యంలో నామినేషన్ తీసుకునే ఎన్నికల అధికారికి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బానోత్ హరిసింగ్, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్, బానోత్ రామ నాయక్, బాలకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖో -ఖో కెప్టెన్ గా నూకల వైశాలి



**దామరచర్ల, డిసెంబర్ 05, ( జనంసాక్షి)** ఉమ్మడి నల్లగొండ జిల్లా ఖో -ఖో అండర్ 19 జట్టు కెప్టెన్ గా దామరచర్ల గిరిజన గురుకుల పాఠశాల బాలికల పాఠ శాలకు చెందిన నూకల వైశాలి ఎంపికయ్యింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కనగల్ మోడల్ స్కూల్ లో జరిగినటువంటి ఖో -ఖో సెలక్షన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా జట్టు కెప్టెన్ గా ఎన్నికయింది. ఈనెల 6, 7, 8 వ తారీకున సికింద్రాబాద్ గ్రౌండ్ పిపిల్లి జూనియర్ కాలేజీలో జరగనున్న ఈ టోర్నమెంటులో రాష్ట్రంలోని అన్ని జిల్లాల జట్లుపాల్గొననున్నాయి. కాగా వైశాలిని గురుకుల ప్రిన్సిపాల్ కవిత, పిడి పార్వతి, పి ఈ టి సరోజ, కోచ్ స్వాతి, ఉమ్మడి నల్లగొండ జిల్లా కోకో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నూకల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు.

## చింతగూడెం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గంగలి కృష్ణ నామినేషన్



**గుర్రంపోడు డిసెంబర్ 05 (జనంసాక్షి)** గుర్రంపోడు మండలం చింతగూడెం గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా గంగలి కృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు భారీగా హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గంగలి కృష్ణ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, శుద్ధ నీటి సరఫరా, వీధిలైట్లు, గ్రంథాలయం, పశువుల దావకాన, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తానని అన్నారు.గ్రామ ప్రజలు ఐక్యమత్యంగా కలిసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని మండల నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమరవాది నగేష్, పాల్వాయి సైదులు, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మండల పాస్టర్స్ నూతన కమిటీ ఎన్నిక





**మునగాల డిసెంబర్ 05 (జనంసాక్షి)** మండల పరిధిలో యేసుక్రీస్తు సేవ చేస్తున్న పాస్టర్స్ నూతన కమిటీని కోదాడ నియోజక వర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డా జె. సుదర్శనం ఆధ్వర్యంలో మండల పరిధి లోని విజయరాఘవపురం గ్రామంలోని పాస్టర్ గోదేశి రత్నరాజు చర్చిలో శు క్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కోర్ కమిటీ ఛైర్మన్ రెవ డా కె. శ్రావణ్ కుమార్, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ డా కె. జోసెఫ్ ల ఆధ్వర్యంలో ఎన్నికైన కమిటీని ప్రకటించారు. మండల గౌరవ అధ్యక్షులుగా గోదేశి రత్నరాజు, అధ్యక్షుల ుగా ఆర్. సిల్వరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం. రాజేష్, కోశాధికారిగా డి. వసంత్ కుమార్, ఉపాధ్యక్షులుగా జె. పరిపూర్ణయ్య, జాయింట్ సెక్రటరీగా లాజరస్, కోఆర్డినేటర్ గా ఎం.డి యాకూబ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అబ్రహాంరాజు, హున్యానాయక్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ రెవ ఆర్. ప్రకాష్, జిల్లా మీడియా కన్వీనర్ జె జె సామ్యూల్ సన్, సీ.హెచ్. ఆదాము, పి. డేవిడ్ రాజు, జె. లూకా, బి. సామ్యూల్ పీటర్, మహేష్ పాల్, జాషువారాజు, ప్రేమానందం, మోషే, రక్షకన్, ఓబద్యా , జె. సామ్యూల్, ఎం. లూకా, జాబెజ్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 7న అయ్యప్ప పడిపూజ మహోత్సవం

**సూర్యాపేట (జనంసాక్షి):**



ఈ నెల 7న జిల్లా కేంద్రంలోని రిలయర్స్ ట్రెండ్స్ ఎదురు సందులో నిర్వహించే నవ కలశ పూజ, అయ్యప్ప పడి పూజా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు గుండా వెంకన్న, గోపారపు రాజు, బొల్లం సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శబరి నగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారణ స్వాములకు నవ కలశపూజ, అయ్యప్ప పడిపూజ మహోత్సవానికి ఆహ్వానించి మాట్లాడారు.ఈ నెల 7న సాయంత్రం నిర్వహించే ఈ పూజా కార్యక్రమాలకు అన్ని మాలధారణ స్వాములు పాల్గొనాలని ఆహ్వానించారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో మొరిశెట్టి రాము, యాట సతీష్, బికె.రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల అప్పీల్ కేసు గెలిచిన సర్పంచ్ అభ్యర్థి ఇందిరా



**కోదాడ,( జనంసాక్షి):** కోదాడ ఎన్నికల అప్పిలేట్ అధికారి ముందు నామినేషన్ చెల్లుబాటు కాదనే విషయంలో మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి కుంచం ఇందిరా గెలిచినట్లు ఆమె న్యాయవాది ఉయ్యాల నర్సయ్య తెలిపారు. మునగాల మండలం రేపాల క్లస్టర్ లోని నర్సింహులగూడెం గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి సీపీఎం పర్చిన అభ్యర్థి కుంచం ఇందిరా హైకోర్టు ఉత్తర్వుల మేరకు నామినేషన్ దాఖలు చేశారు. ఆమె నామినేషన్ ను రేపాల క్లస్టర్ స్టేజ్1 ఎన్నికల అధికారి పరిశీలన చేసిన అనంతరం, ఆమె ఓటు సెప్టెంబర్ నెలలో నమోదు కాలేదని,తనకు ఇచ్చిన ఓటర్ లిస్టు నందు ఆమెకు ఓటు లేనందున ,ఆమె నామినేషన్ చెల్లుబాటు కాదని ప్రకటించారు. నామినేషన్ చెల్లదంటూ ప్రకటించిన రేపాల క్లస్టర్ ఎన్నికల అధికారి నిర్ణయం పై న్యాయవాది ఉయ్యాల నర్సయ్య కోదాడ ఎన్నికల అప్పిలేట్ అధికారి సూర్యనారాయణ ముందు అప్పీల్ వేసి,ఎన్నికల నోటిఫికేషన్ నాటికే ఆమె ఆ గ్రామంలో ఓటర్ గా నమోదు అయి ఉన్నారని,ఆమెకు పోటీ చేసే అర్హత ఉందని,హైకోర్టు అన్ని విషయాలు పరిగణనలోకి తీసుకునే ఆర్డర్ ఇచ్చారని న్యాయవాది తన వాదనలు వినిపించారు. అప్పీల్ అధికారి సూర్యనారాయణ అన్ని అంశాలను పరిశీలించి, పై అధికారులు కలెక్టర్, ఎన్నికల కమిషనర్ లతో సంప్రదించి,చర్చించిన అనంతరం ఆమె నామినేషన్ చెల్లుబాటు అవుతుందని తీర్పునిచ్చారు.వెంటనే ఆమె నామినేషన్ చెల్లుబాటుకు చర్యలు తీసుకుంటూ,కుంచం ఇందిరా నరసింహుల గూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పోటీలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత మండల అధికారులను అదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.దీనితో కుంచం ఇందిరా ఆమె భర్త కుంచం నర్సయ్య ఆ గ్రామ సీపీఎం నాయకులు, సీపీఎం బలపర్చిన వార్డు మెంబర్ల అభ్యర్థులు అందరూ కలిసి ఎన్నికల అధికారులను కలిసి,ఆర్డర్ కాపీలను అందజేసినారు. కేసు గెలిపించిన ఉయ్యాల నర్సయ్య ను సీపీఎం నాయకులు అభినందించారు.